క్లుప్తంగా

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, హనుమంతు శర్మ, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు కొలువు చేసి ఆలయ ప్రాకారంలో పల్లకోత్సవం కనులపండువగా చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్రీడా ఎంపిక పోటీల్లో మార్పు

పాములపాడు: మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీ తేదీల్లో మార్పు చేసినట్లు ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన అండర్ 17 విభాగంలో, 14వ తేదీన అండర్ 14 విభాగంలో బాల, బాలికలకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని క్రీడాకారులు, వ్యాయామా ఉపాధ్యాయులు గమనించాలని వివరించారు.

అమరవీరులకు నివాళి



వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరు: బైర్లూటి చెంచుగూడెంలో సోమవారం జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట రమణ మాట్లాడుతూ అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అనంతరం కరివేనలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

బండిఆత్మకూరులో రేపు 'జగనన్నకు చెబుదాం'

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 15న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. సోమవారం ఎంపీడీఓ వాసుదేవగుప్త మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 15న ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలుడికి పాముకాటు

జూపాడుబంగ్లా: కిరాణం కొట్టు నుంచి ఇంటికి వెళ్తున్న తొమ్మిదేళ్ల ఆదివిష్ణు అనే బాలుడు పాముకాటుకు గురైన ఘటన మండలంలోని తాటిపాడు గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు ఆదివిష్ణు కిరాణంకొట్టు వద్ద సరుకులు తీసుకొని ఇంటికి వెళ్లసాగాడు. రోడ్డు పై వెళ్తుండగా కాలుకు పాము కాటువేయటంతో అతను భయాందోళతో ఇంటికి పరుగులు తీశాడు. జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపటంతో వారు అతన్ని హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు చరిత్రాత్మకం

మహానంది: అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాలలో పదిశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం చరిత్రాత్మకమైన నిర్ణయమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఓ.కరుణాకర్‌రెడ్డి అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం ఆయన సోమవారం మహానందికి వచ్చారు. దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ పదిశాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం హర్షించదగిన విషయమన్నారు. దేశవ్యాప్తంగా ఆరుకోట్ల మందికి పైగా నిరుపేద ఓసీలను ఓబీసీ జాబితాలో చేర్చి ఆర్థికంగా ఆదుకునేందుకు రూ. 50వేల కోట్లతో జాతీయ ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో ఓసీల సమస్యలను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చి ప్రధాన అంశంగా పరిగణించాలని కోరారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

నాగలింగేశ్వరస్వామికి పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో వెలసిన శ్రీ నాగలింగేశ్వర స్వామికి శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేపట్టారు.

చిగురించిన ఆశలు.. వరి సాగులో రైతన్నలు

- వర్షాలతో చెరువులు, కుంటల్లో నీరు
- కాలువల్లో నీటి ప్రవాహం
- వరి సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

నందికొట్కూరు: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురిసినా ఆగస్టు నెలలో వరుణుడు ముఖం చాటేయడంతో పంటల సాగుపై సందిగ్ధత నెలకొనడంతో రైతన్నలు ఆందోళనకు గురయ్యారు. అయితే సెప్టెంబర్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టుల్లో నీరు చేరడం, కాలువలకు నీరు వదలడం, చెరువులు,కుంటలు నిండటంతో పాటు వర్షపు నీరు పొలాల్లో చేరింది. దీనికితోడు బోరుబావుల్లో భూగర్భజలాలు కూడా పెరిగాయి. దీంతో అన్నదాతలు వరిసాగుకు ఉపక్రమించారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందజేయడంతో అప్పుల బాధ కొంత వరకు తగ్గిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలతో వరిసాగుకు మొగ్గు

ఖరీఫ్ సీజనల్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. ఇక్కడ పండించే పంటలకు ప్రధాన సాగునీటి వనరులుగా కేసీ కెనాల్, ఎత్తిపోతల పథకాలు, చెరువులు, బోరుబావులు ఉన్నాయి. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి పంట మంచి దిగుబడి వచ్చాయి. అయితే ఈ ఏడాది జూన్, జూలైలో కాస్త వర్షాలు కురిసినా, ఆగస్టులో పడలేదు. దీంతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయి. ఫలితంగా కేసీ కాలువకు నీటి విడుదల నిలిచిపోయింది. దీంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు కూడా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పెరిగి కేసీకి నీరు విడుదల చేయండతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. దీంతో కనీసం సొంత అవసరాలకైనా ఉపయోగపడుతుందని ఉద్దేశంతో రైతులు వరి సాగుకు ఉపక్రమించారు. ప్రస్తుతం పంటపొలాల్లో వరినాట్లు, సాగు పనులు ఊపందుకున్నాయి.

2,100 హెక్టార్ల వరి సాగు

నియోజకవర్గంలో 2100 హెక్టార్ల వరకు ఇప్పటికే



వరినాటుతున్న వ్యవసాయ కూలీలు

సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. నందికొట్కూరు మండలం-100 హెక్టార్లు, పగిడ్యాల-700 హెక్టార్లు, జూపాడుబంగ్లా-200 హెక్టార్లు, పాములపాడు-100 హెక్టార్లు, కొత్తపల్లి-1000 హెక్టార్లు చొప్పున ఇప్పటి వరకు సాగు చేస్తున్నారు. జూపాడుబంగ్లా, పగిడ్యాల, నందికొట్కూరు మండలాల్లో మరింత వరి సాగు చేసే అవకాశాలు ఉన్నాయి.



నాగటూరు వద్ద ఎద్దులతో వరి నాట్టేందుకు మడిని సిద్ధం చేస్తున్న రైతన్న

రుణసాయంతో ఊరట



ఈ ఏడాది ఆలస్యంగానైనా వర్షాలు సమృద్ధిగా కురిశాయి. మూడు ఎకరాలలో వరి నాట్టేందుకు సిద్ధం చేస్తున్నా. సీఎం వైఎస్ జగనన్న రైతు భరోసా సాగుకు ముందే ఇచ్చారు. బ్యాంకు తరుపున రైతులకు అవసరమైన రుణసహాయం ప్రభుత్వం అందజేస్తుంది. అంతేకాక రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీమాఫీ ఉంటుంది. జగనన్న రైతులు పంటలు సాగు చేసేందుకు అన్ని రకాలుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నారు.

– మల్లయ్య రైతు జూపాడుబంగ్లా

పూర్తిస్థాయిలో వరిసాగు



నాలుగేళ్ల నుంచి వర్షాలు బాగా కురవటంతో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలు, కేసీ కెనాల్, బోరుబావుల కింద పూర్తిస్థాయిలో వరి సాగు చేస్తున్నాం. అందుకు అరకొర వర్షాలకు ముందే నారలు పోశాం. ఇటీవల కురిసిన వర్షాలకు వరి నార నాటుతున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, మందులు అందిస్తున్నారు. పంట సాగుపై అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

– ఏసేపు రైతు గువ్వలకుంట్ల గ్రామం, కొత్తపల్లి మండలం

కాలిబాటలు వేసుకోవాలి

25 నుంచి 30 రోజుల్లోపల కాలి బాటలు చేసుకోవాలి. పిచికారీ చేసుకోవడానికి చాలా అనువుగా ఉంటుంది. అలాగే చీడపీడల బెడద తగ్గుతుంది. వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఆరుతడి పంటలు సాగు చేసుకుంటే రైతులకు మంచిది. అయినా రైతులు వరిసాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. వరి పంట సాగుకు కావలసిన సలహాలు సూచనలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తాం.

– షేక్షావలి, ఏఓ, నందికొట్కూరు.

మల్లన్న సేవలో కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రి భగవత్ ఖూబకు ఆహ్వానం పలుకుతున్న ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం కేంద్ర రసాయన ఎరువుల, పునరుత్పాదన శక్తి సహాయ మంత్రి భగవత్ ఖూబ, కర్ణాటక రాష్ట్ర భూగర్భ, గనుల, ఉద్యానవన శాఖ మంత్రి మల్లికార్జున వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



మల్లన్న దర్శనార్థం వస్తున్న కర్ణాటక మంత్రి మల్లికార్జున

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నాడు-నేడులో భాగంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాఠశాలల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నాడు-నేడు పనులపై వర్క్‌షాప్ నిర్వహించారు. 189 పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్న సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణ పనులు టెక్నికల్ సమస్యలు ఏమైనా ఉంటే అయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈనెలాఖరు నాటికి మండల స్థాయిలో నాలుగు పాఠశాలల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. జిల్లాలో 973 పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, హెచ్‌ఎంలు సకాలంలో బిల్లులు ఖర్చు చేయాలని, ఆ వివరాలను ఎస్‌టీఎంఎస్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మానిటరింగ్ అధికారి లలిత, ఎంఈఓ బ్రహ్మం పాల్గొన్నారు.

జంబులమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ



జంబులమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో జంబులాపరమేశ్వరి దేవి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఉన్న అమ్మవారి గుడి నేషనల్ హైవే విస్తరణలో పోతున్నందున గ్రామస్తులు నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు గాను గ్రామానికి చెందిన సక్కుబాయి, రామకృష్ణ సింగ్‌ల కుమారులు 15 సెంట్ల స్థలాన్ని, బోయ బాలరాజు 2 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. వీరిని గ్రామ సర్పంచు నాయిని సావిత్రమ్మ, గ్రామస్తులు దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణలు పూజ కార్యక్రమానికి హాజరై ప్రజలతో మాట్లాడారు. తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు నాయిని సావిత్రమ్మ, ఉప సర్పంచు సలాం, ఏఈ రాఘవేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, వీఆర్వో సామేలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రంజిత్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తర్తూరు రెండో వార్డు మెంబర్ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం అనంతరం పంచాయతీ పుస్తకంలో సంతకం చేస్తున్న నాగేంద్ర

జూపాడుబంగ్లా: తర్తూరు రెండో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన బోయ నాగేంద్రతో సోమవారం సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, కార్యదర్శి ఖాజాహుసేన్ గ్రామ సచివాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. గతనెల 19న తర్తూరు 2 వార్డుకు జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో 168 ఓట్లకు గాను 146 ఓట్లు పోలవ్వగా ప్రత్యర్థి షేక్ నూరుల్లాపై బోయనాగేంద్ర 20ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. గెలుపొందిన బోయనాగేంద్రకు ఓట్లలెక్కింపు అనంతరం ఎన్నికల అధికారులు డిక్లరేషన్ ఫారం అందజేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారంగా గెలుపొందిన బోయనాగేంద్రతో సోమవారం ప్రమాణస్వీకారం చేయించి గ్రామపంచాయతీ పుస్తకంలో మినిట్స్ పొందుపరిచారు. వార్డుమెంబరుగా బాధ్యతలు చేపట్టినట్లు అతనితో సంతకం చేయించారు. కార్యక్రమంలో శాలిపైల్‌మాన్, అబ్దుల్ రహిమాన్, నాగేశ్వరరావు రజక, శేషారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



గండి ఏరియాలోని తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

పగిడ్యాల: అతిసారం ప్రబలిన గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ రాంబాబు హెచ్చరించారు. సోమవారం పగిడ్యాల, ఆంజనేయనగర్, బీరవోలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి మంచినీటి పథకాలకు సంబంధించిన బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, పైప్‌లైన్లు, డ్రైనేజీ కాలువలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గండి ఏరియాలో ఉన్న పైప్‌లైన్‌ను తొలగించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఉండే డ్రైనేజీ కాలువల్లోని పూడికను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అతిసారం కేసులు పూర్తిగా తగ్గే వరకు ట్యాంక్‌లకు నీటి సరఫరా చేయరాదని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సచివాలయ కార్యదర్శి కోట్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

9 కేసులు నమోదు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆంజనేయనగర్, బీరవోలు, పగిడ్యాల గ్రామాల నుంచి మరో 9 అతిసారం కేసులు వచ్చినట్లు వైద్యాధికారి మోహన్ సోమవారం తెలిపారు. బ్యాక్టీరియా ప్రభావం 7 రోజుల వరకు ఉంటుందని, ప్రస్తుతం కేసులు తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం



ప్రయాణికుడికి బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: కర్నూలుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే వారి కోసం గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నాన్ స్టాప్ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం ఈ నెల 1న గిఫ్ట్ స్కీం ప్రారంభించారు. సోమవారం ప్రయాణికుల సమక్షంలో బస్సు టికెట్లను డిప్ తీసి మొదటి బహుమతి తరిగోపుల శ్రీనివాసరెడ్డి, రెండో బహుమతి గోపాల్ రాజు, మూడో బహుమతి రాఘవేంద్రారెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ఆదాయం పెంచేందుకు గిఫ్ట్ స్కీం అమలు చేస్తున్నామన్నారు. టికెట్ వెనుక భాగంలో పేరు, ఊరు, సెల్ నెంబరు రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెల 8వ తేదీన, 23వ తేదీన బాక్స్‌లను ఓపెన్ చేసి మూడు టికెట్లు డిప్ తీసి 1, 2, 3 బహుమతులను ప్రయాణికులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

15 లోగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఈనెల 15లోగా రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఆశ్రయించి రైతులు వారు సాగుచేసిన పంటల వివరాలు తెలియజేసి ఈ-క్రాప్‌బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు గాను సాధారణ సాగు విస్తీర్ణం 10,022హెక్టార్లు కాగా అందులో ఇప్పటి దాకా 80 శాతం మేర 8,017 హెక్టార్లలో మిరప, కంది, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర, వరి, పసుపు తదితర పంటలు సాగుచేసినట్లు తెలిపారు. ఇప్పటిదాకా గ్రామాల్లోని ఆర్బీకేల సిబ్బంది 11,500వేల ఎకరాల్లో ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన ఎకరాల్లో పంటలకు సత్వరమే ఈ క్రాప్ బుకింగ్ చేసి వందశాతం పూర్తయ్యేలా చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకొన్న రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవటం ద్వారా పంటనమోదు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

చాకలి ఐలమ్మ, రామకృష్ణ స్ఫూర్తితో పని చేద్దాం

పాములపాడు: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తనపల్లి రామకృష్ణ ఆశయ స్ఫూర్తితో పని చేయాలని రజక సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, ధర్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారి వర్ధంతి సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు మద్దిలేటి, నాగన్న, మధు, లింగస్వామి, స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షలను విజయవంతం చేయండి

ఆత్మకూరు : పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నిరసన దీక్షలు విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ నాయకులు రాబిన్‌సన్ మాదిగ , దరగయ్య మాదిగ , నాగేషులు మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీలను ఎ,బీ,సీ,డీ లుగా విభజించాలని, వర్షాకాలం సమావేశాల్లో బిల్లులు ఆమోదించాలని కోరుతూ నిరసన దీక్షను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుజ్జి, నాగయ్య, రామారావు, పుల్లయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు పంట నమోదు చేయించుకున్న అనంతరం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయాధికారుల వద్ద ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ షేక్షావలి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ పూర్తి చేసుకుంటేనే రైతులు పంట నమోదు చేయించుకున్నట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, మల్యాల రైతులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసమస్యనైనా స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కారం చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలోని దుద్యాల గ్రామంనుంచి ఓ రైతు ల్యాండ్ పార్టేషన్ చేయాలని అర్జీ పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

చట్టానికి ఎవరూ చుట్టం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల: చట్టానికి ఎవరూ చుట్టం కాదని, మా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరి మీద కక్ష, కోపం లేదని సీఎం తపనంతా ప్రజా శ్రేయస్సు కోసమేనని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పద్మావతినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రూ.370 కోట్ల స్కామ్‌లో చంద్రబాబు అరెస్ట్ అయితే స్కిల్ స్కామ్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, దాని వల్ల ఇంత మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని, ఆధారాలు చూపిస్తూ చెప్పాల్సింది పోయి.. తనను కక్షపూరితంగా అరెస్ట్ చేశారని, అన్యాయంగా అరెస్ట్ చేశారని ఆ పార్టీ నాయకులంతా మాట్లాడుతున్నారు తప్పా..ప్రజలకు వాస్తవాలు వివరించలేకపోతున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిస్తే ప్రజలు పట్టించుకోలేదన్నారు. ఇన్నేళ్లు దాగిన ఆయన అవినీతి అంతా ఒక్కొక్కటిగా బయటకు వస్తుందని చెప్పారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదనేది ఆలస్యంగానైనా మరోసారి నిరూపితమైందన్నారు. జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, తిరుపంరెడ్డి, బుగ్గారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మోతుకూరు నాగేశ్వరరెడ్డి, ప్రవీణ్‌తేజ, పుల్లయ్య, సుబ్బరామయ్య, పుల్లారెడ్డి, శరభారెడ్డి పాల్గొన్నారు.

నేడు తెలుగుగంగ నుంచి నీటి విడుదల

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన తెలుగు గంగ ఆయకట్టు కింద రైతులు సాగు చేసిన పంట పొలాలు ఎండిపోకుండా మంగళవారం తెలుగు గంగ నుంచి సాగు నీరు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, ఇందువలన రైతులకు వెంటనే సాగు నీరు విడుదల చేయకపోతే తెలుగు గంగ ఆయకట్టు కింద నియోజకవర్గంలో వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు నష్టపోకుండా వెంటనే నీటిని విడుదల చేయాలని తాను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ , సీఈతో మాట్లాడి నీరు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు కలెక్టర్ సుముఖత వ్యక్తం చేయడం జరిగిందన్నారు. అలాగే సిద్ధాపురం చెరువుకు ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు విడుదల చేస్తున్నామని చెప్పారు. పథకానికి సంబంధించిన మోటార్లు సరిగా లేకపోవడం, ట్రాన్స్‌ఫారం, విద్యుత్ సమస్య ఉండడంతో సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించి, నీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, దేశం తిరుపంతిరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనిపించని బంద్ ప్రభావం

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం టీడీపీ చేపట్టిన బంద్ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలం, నంద్యాల, కర్నూలు ప్రాంతాలతో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. కిరణ దుకాణాలు, పెట్రోల్ బంక్‌లు, ఆటోలు, హోటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఎప్పటిలాగే పనిచేశాయి. పట్టణంలో టీడీపీ నాయకులు బంద్ నిర్వహించేందుకు టైర్లను అంటించడంతో పోలీసులు ఆర్పివేసి కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బంద్ ప్రభావం ఏ మాత్రం కనిపించకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

జూపాడుబంగ్లాలో కానరాని బంద్..

జూపాడుబంగ్లా: తెలుగుదేశం పార్టీ సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంతో జూపాడుబంగ్లాలో ఎలాంటి బంద్ ఆనవాళ్లు కనిపించలేదు. పాఠశాలలు, దుకాణాలు యథావిధిగా నిర్వహించడంతో వ్యాపారాలు కొనసాగాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు యథావిధిగా తిరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తోంది. ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్ల పైకి వచ్చి బంద్ నిర్వహించేందుకు ఆసక్తి చూపలేదు.



ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికుల సందడి

నేడు స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



క్రీడా కోర్టులను సిద్ధం చేస్తున్న ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ టి.కృష్ణ, కార్యదర్శి శ్రీనాథ్

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ టి. కృష్ణ, నంద్యాల సెక్రటరి పి. శ్రీనాథ్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్కూల్ గేమ్స్ పోటీలు చక్కటి అవకాశమన్నారు. ఈనెల 12, 13 తేదీలలో అండర్-14, అండర్ -9 విభాగాల్లో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్. బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర క్రీడా పోటీల నిర్వహణకు కోర్టులను సిద్ధం చేశామని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు రవికుమార్, వీరన్న, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రషీద్‌మియ్య, క్రీడాశ్రీ పీతాంబర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరులో రేపటి నుంచి..

మహానంది: బండిఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఈ నెల 13వ తేదీన మండల స్థాయి క్రీడా పోటీల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు యశోద, మోహన్‌రెడ్డి తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగం వారు హాజరుకావచ్చని చెప్పారు.

రేపు బిజినవేములలో ఎంపిక పోటీలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో ఈ నెల 13, 14వ తేదీలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి సోమవారం తెలిపారు. వీటిలో కబడ్డీ, లీబాల్, ఖో-ఖో, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడా పోటీలలో మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. 13న అండర్ 14, 17 బాలురకు, 14న బాలికలకు 9రకాల క్రీడాంశాలలో పోటీలు ఉంటాయన్నారు.